# దౌర్జన్యం

[చిట్టూరు రామచంద్రరావు]

●

●

[స్వార్థపరులతో కూడుకొన్న ప్రపంచంలో అన్యాయము యెన్ని యుగాల్నించి వున్నదో! ఈ అన్యాయం, యీ అక్రమం యిల్లా వున్నదంటే వినక పోవటం మరీ అన్యాయం. పశువుల్లాగా పనులు చేస్తారు కార్మికులు పగలల్లా. ఫలితంమాత్రం సున్న. వరినారు చల్లేది, నాట్లువేసేది, కోతలు కోసేది, నూర్పిళ్లుచేసేది కార్మిక కర్షకులు. వారి కళ్ళముందే ఆ ధాన్యమంతా, కలిగినవారు తీసుకుంటారు. కష్టమంతా వారిది. కలిగినవారిది సుఖం. బీదల కష్టాలన్నీ దోచుకుంటారీ ధనికులు. న్యాయంకాదని చెప్పే వాళ్లేరీ? పగలనక రాత్రనక పాటుపడతారు. మేడలు మిద్దెలు కడతారు. కాని నివసించుటకిల్లు తినటానికి తిండి, కట్టుటకు గుడ్డ కరువైనాయి. చూచారా న్యాయం? ఇంతేకాదు. న్యాయమైనా అన్యాయమైనా ధనికస్వాములు చెప్పినదే చెలామణి అవుతుంది ప్రతి విషయములోను. ఇటువంటి అన్యాయాలూ, అక్రమాలూ ప్రపంచంలో యెన్ని జరిగింది. జరుగుతుందికూడ.] వ్యాసకర్త.

ఆ గూడెమంతటికి లక్ష్మయ్య బుద్ధిమంతుడు 18 సంవత్సరముల వయస్సుగలవాడు అయినప్పటికి చక్కని కండలుతిరిగిన శరీరం. చాలా తెలివైనవాడు. వాడిధోరణేవేరు. చదువుకున్నది 3 వ ఫారమే అయినా ఇంగ్లీషుపుస్తకాల్లో ముఖ్యమైనవి చాలా వరకు డిక్షనరీల సహాయంతో చదివాడు. హిందీలోనూ, సంస్కృతంలోను మంచి జ్ఞానంగలవాడు. వాడుచదవనిపుస్తకం ఆవూరి లైబ్రరీలోలేదనటంలో అతిశయోక్తిలేదు. అతనిహృదయం చాలా కోమలమైంది.

అతనితండ్రి సామాన్యకార్మికుడు. అయితేనేం? కష్టార్జితమైనడబ్బు పొదుపుగా వాడుకొని అతనికి విద్యచెప్పించాడు. ఒకేఒక్క కుమారుడు కావటంచేతా, తల్లిలేని బిడ్డకావటంచేతా అతనంటే బహుప్రేమతో ఉండేవాడు. ఈ కార్మికయువకునికి తగినభార్య రామి. కాటుకకండ్లు, కిలకిల నవ్వులు, దబ్బపండువంటి చాయకళ్ళ, బొద్దుగావుండే శరీరం, నిరాడంబరమైనఅలంకరణములు, ఏగౌరవనీయకుటుంబాలలోనూ, ఏధనిక భూస్వాముల కుటుంబాలలోనూ కనుపించని నమ్రత, కళకళలు ఆ నిరాడంబర జీవిలో గోచరిస్తాయి. ఆమె రోజూ పంపుదగ్గర నీరుతీసుకుని, భుజానపెట్టుకొని బిందెతో వీధిఅంతా వెలుగుతో, వీధివెంట పోతుంటే, ఆమెను గాంచువారందరూ ఆ నిరాడంబర కార్మిక కుటుంబాన్ని మనసార తలచుకొని దీవించేవారు. ఈ హోదాలు, ఈ దర్జాలు, దొంగగౌరవాలు, ఉద్యోగాలు, డబ్బు, మోటార్లూ కలిగిన అగ్రజాతివారిలో ఇటువంటి అమూల్యరత్నం ఉంటుందాఅని సందేహం. చిలుకా గోరింకల్లాంటివారి జీవితం, చూడ ముచ్చటగొల్పే వారి సాధుజీవనం ఆవూరిలో నిర్విచారంగా, నిశ్చింతగా, సుఖప్రదంగా గడచిపోతున్నది. అతను ఫ్యాక్టరీలో పెద్దమేస్త్రీపని సంపాదించాడు మెల్లగా. కాని చెరువులోనుండే చేపను, ఏం అపకారం చేసిందని జాలరివాడు చంపుతాడు? ఆకాశాన ఎగురుతూ ఆనందంతో అరిచేపిట్టఏంఅపకారంచెయ్యకపోయినా వేటకాడు చంపుతాడెందుకూ? ఒకరిజోలికి పోక, తమసంపాదన, తమవిజ్ఞానము, తమ సంసారము చూచుకునే ఈ అభాగ్య కార్మిక కుటుంబం, ఈ నిరాడంబర జీవులిల్లా చెల్లాచెదరైనారు, ఎవరికి ఏమి అపకృతిచేశారని? అపకృతిచేయుటానికి కారణం అవసరము లేదుగాబోలు ధనికులకు?

ఎర్రనిమబ్బులాకాశాన అక్కడక్కడ పరుగు లెత్తుతున్నాయి. సూర్యు డస్తమించాడు. ఊరికి ప్రక్క నున్న మామిడితోపులోని చెట్లపూత ఎర్రని కిరణాలతో కలసి కెంపురంగువలె మెరుస్తున్నది. అవ్వూరి కరమైలు దూరంలోనున్న ఫ్యాక్టరీగొట్టాలు పొగ గ్రక్కుతూ చిన్నచిన్న ధూమతెరలను తయారు చేయుచున్నాయి. గూడెంలోవున్న వాళ్ళంతా కార్మికులవడంచేత, ఎవ్వరూ ఇంకా ఫాక్టరీనుండి రాలేదు., ఇంతలో యెగదువ్విన క్రాపు, నోట్లో సిగరెట్టు జపానుసిల్కుగుడ్డలు, నీలమేఘచ్ఛాయనుమించే శ. రం, మొద్దు పెదిమల మూతిగలవాడు పందికొక్కువలె పరుగిడుచు వీధిలోగుండా పోతున్నాడు. చూపులకతడు ధనికుల బిడ్డవలెనున్నాడు. ఇంతలో 'అయ్యో! అయ్యో!'' అని అరుపు. వీధిఅంతా నిశ్శబ్దంగావున్నది. ఎక్కడా కనుచూపుమేరలో మనుష్యసంచారమేలేదు. పంపువద్దమాత్రం, రామి కరుణాదీనంగా అరుస్తున్నది. ''కాటుక కంటినీరు చను కట్టుపయింబడ'' అన్నట్లేడ్చుచున్నది. ''అయ్యో! నేను నీకు చెల్లెలవంటిదాన్ని|వద్దు...నన్నువదులు... అయ్యో!''

ఎదురుగుండా ఆ యువకుడు...యువకరూప రాక్షసుడు, కటిక కిరాతకుడు...కామాంధుడు... ఆ సుగుణమణి చేతినిపట్టుకొని లాగుచున్నాడు నడి వీధిలో. ''రామీ! నేను ఎప్పుడూ నీవద్దకు రాకపోయినా అదిగో, ఆ మామిడితోపులోనుండి ప్రతి రోజూ నిన్ను చూస్తునేయున్నాను. నీకెంతకావాలో చెప్పు అడిగినంతా యిచ్చేస్తాను. ఇప్పుడే యిచ్చేస్తాను'' అంటున్నాడు ఆ క్రూరాత్ముడు. ''అన్నా! నేనటువంటిదాన్ని గాను. నన్ను వదిలేసెయ్యి'' అని వేడుకొంది, ''ఆరే! బద్మాష్, వదులు. ఇవతలకురా, లేకపోతే నిష్కారణంగా చస్తావు'' అంటూ లక్ష్మయ్య సింహకిశోరంలాగ దూకుతూవచ్చేడు. '' ఈ భారతజాతి యిట్లా నీచమానవులవలె, బానిసలవలె పడివుండటానికి కారణం నీవంటి నీచులక్కడక్కడ ఉండటమే కారణం'' అన్నాడు లక్ష్మయ్య, కళ్లు చింతనిప్పులవలె ఎర్రగా జ్యోతులవలెనున్నాయి. నరాలన్నీ ఉబికినై. ఉద్రేకంతో వళ్ళంతా కంపించిపోతుంది. ''ఈవిధంగా స్త్రీలను హింసపెట్టేబుద్ధి, హింసాస్వభావం పాపిష్టిబుద్ధి, స్త్రీ ఎక్కడకనబడ్డా......సినిమాల్లో ఉత్సవాల్లో ఈ కామం కళ్ళకెగదట్టి చేయరాని పనుల్ని చేయిస్తుంది. ముందువెనుకలు, సమయాసమయములు యోచించచక తానేమైపోతున్నదీ గమనించక నడివీధిలోనే యిట్టి సాహసాలకు దిగుతారు. నీళ్ళముందు నీభార్యనో, నీ తోబుట్టువునో ఇతరులిలాచేస్తే నీమనస్సులో ఎంతబాధపడుతావో ఆలోచించు'' అంటూ కలియబడ్డాడు లక్ష్మయ్య ఆ యువకునిమీద. ఆ యువకుడు నిలువునానీరై లక్ష్మయ్య పాదాల మీద పడ్డాడు క్షమించమని. ''పశువా! ఇక ఎప్పుడూ ఎక్కడా ఇటువంటి పనులుచేయకు'' అనిలక్ష్మయ్య ఆ యువకుని పైకిలేవనెత్తాడు.

* * *

పక్షుల కిలకిలారావములు స్వాగతమిచ్చుచున్నవోయన లేత మినమిసలాడే ఆకులతోవున్న మామిడిచిగుళ్ళపై కళ్ళెర్రచేసి చూస్తున్నట్లుగా, అరుణ కిరణాలతో సూర్యుడుదయించినాడు. పోలీసువాడొకడా దారినివెళ్లుతున్నాడు. ఇంకా గూడెంలో వాళ్లు ఎవరూ పనిలోకి పోకపోవడంవల్ల అనేకులు, పోలీసువాడిచుట్టూ మూగారు. పోలీసువాడు కార్మికరత్నమైన లక్ష్మయ్యయింటిలోనికి వెళ్లాడు. ''ఒరే!

వెధవా! లచ్చన్నా, గూడెంలో పెద్ద పెంకెగాడివైనావుట్రా! మీఫ్యాక్టరీ ఖామందు గారి అబ్బాయిని దౌర్జన్యంగాకొట్టి కత్తితోపొడవబోయినావట్రా!" అని లాఠీతోకొట్టి బైటకు లాక్కొనివచ్చాడు. "ఏమయ్యా! న్యాయమక్కరలేదా? లంచంతీసుకుని, కులంతక్కువవాళ్ళం, బీదవాళ్ళంఅయిన మమ్మల్ని యీవిధంగా కొట్టుతూవుండడం నీతియేనా? ప్రభుత్వము నీవైపు వున్నాయిగదాయని నీవు ధైర్యంగా, ఒంటరిగా, న్యాయాన్యాయ వివక్షతలేకుండా నన్ను కొట్టేవు. నీవే నన్ను ఒక్క నెలరోజులక్రితం మూడు రూపాయలు మామూలడిగావు. అది లంచం నే నివ్వనన్నాను. నీకుజ్ఞాపకంలేదూ? నీకే లంచం యిచ్చినట్లయితే ఇప్పుడిలా కొట్టివుండేవాడివేనా? నేను బలంలేనివాడినిగాను. నాకు యీగుంపులోని వారంతాఅండ. నిన్ను నేను తిరిగికొట్టగలను. కాని అది శాసనంలోతప్పు. ప్రభుత్వదృష్టిలోతప్పు. నిన్నటి రోజున నాభార్యమానం రక్షించుట కతనిని బెదరించటం నిజమే. కానిఅతనివంటిమీద చేయిఅయినా వేసిఎరుగను. జరిగినసంగతియిది. తరువాత న్యాయాన్యాయ విచక్షణ చేసేవాడు భగవంతుడు" అన్నాడు లక్ష్మయ్య. "సరే! అదంతా నాకెందుకు నిన్ను అరెస్టుచెయ్యమని ఆజ్ఞాపింపబడ్డాను పైఅధికారులచేత. నాడ్యూటీ నేనుచెయ్యాలి. అంతే" అని పోలీసువాడు లక్ష్మయ్యను తీసుకుపొయ్యాడు.

* * *

జైలులోనుండగా లక్ష్మయ్య ఎన్నిబాధలుపడ్డాడో వ్రాస్తే అదిఒక గ్రంథంగా తయారవుతుంది. ఎన్ని బాధలు పడాలో, ఎన్ని అవమానాలుపడాలో, ఎన్నితిట్లుతినాలో అవన్నీ పడ్డతర్వాత "విచారణ" అన్నారు ప్రభుత్వంవారు. న్యాయాన్యాయ విచారణలేని ఆ ప్రభుత్వవిచారణ సారాంశంయిదే:—

"లక్ష్మయ్య అనే కూలీమేస్త్రీ తన యజమాని తనకు జీతము హెచ్చుచేయలేదను కారణంచేత తన యజమానికుమారుణ్ని దౌర్జన్యంతో కొట్టి, కత్తితో పొడవబోయినందున సదరు లక్ష్మయ్యకు 1 సంవత్సరం కఠినఖైదు విధించడమైనది".

దీన్ని న్యాయంఅని హర్షిస్తుందీ స్వార్థముతో గూడుకొన్న ప్రభుత్వం దీన్ని న్యాయమే అనాలో, అన్యాయమే అనాలో మీరేచెప్పండి.

కథాంజలి
అన్ని హిగ్గిన్‌బాథమ్సు బుక్ స్టాల్సులోను దొరకును. వెల 0-2-0

శక్తి సంజీవినీ! మృత్యుంజయమహిమ!
"భ్రమరమారి"
సాధ్యాసాధ్యసర్వవిధకుష్ఠు రోగములు, నానావిధ చర్మవ్యాధులు, భయంకరమై, క్యాన్సరు, మేహవ్రణములు, (కార్బంకిల్ భగందరములు, గండమాలలు, పెట్టుమందుల విషోపద్రవములనెల్ల నశింపజేయు లోకప్రసిద్ధ దేవదత్త అమరమహౌషధము. కుష్ఠురోగులకు పునర్జన్మమిచ్చు ఇట్టి మహాదుర్లభ సంజీవినీ దివ్యౌషధ మింకొకటి పృథివియందుండదు. భ్రమరమారి లేహము నెలకు అగునది 16 తు॥ డబ్బి రూ. 8 తైలము 4 ఔన్సుల సీసా రూ. 4. కేవలము రక్తశుద్ధికిన్ని—సందేహ కుష్ఠు నశించుటకు భ్రమరమారి వటికలు 64 కి రు. 6. ఇవి మావద్దమాత్రమే దొరకును.
రాజవైద్య, బి. యస్. రావు,
గంజాం ఆయుర్వేదిక్ ఫార్మసి, ఎర్రిమేడ.
బరంపురం, గంజాంజిల్లా.